సాక్షి అనంతపురం

శనివారం । 4 । నవంబర్ । 2023



తేలికపాటి వర్షసూచన

రాగల నాలుగు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు సహదేవ రెడ్డి, అశోక్‌కుమార్ తెలిపారు.



టమాట కిలో రూ.21

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలివాతావరణం మొదలైంది. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



కృష్ణంరెడ్డిపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. కృష్ణంరెడ్డిపల్లి వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఓపీ, రెఫరల్, రక్త పరీక్షలు తదితర రికార్డులను పరిశీలించారు. వివిధ వైద్య శిబిరాల్లో 2,657 మంది ఓపీ వైద్య సేవలు పొందారు. 472 మంది వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద పరీక్షలు చేయించుకున్నారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న 14 మందిని జిల్లా, ఏరియా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. శనివారం జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

పోలీసులు శారీరకంగా దృఢంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అదనపు ఎస్పీ హనుమంతు

అనంతపురం క్రైం: పోలీసు సిబ్బంది సంక్షేమంతో పాటు ఆరోగ్యంపైనా ఎస్పీ అన్బురాజన్ దృష్టి సారించారు. పోలీసులు శారీరకంగా దృఢంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు జిల్లా పోలీసు యూనిట్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో రోజూ 25 మంది పోలీసు సిబ్బందికి షుగర్ టెస్టు, లివర్, కిడ్నీ ఫంక్షనింగ్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, సీబీపీ తదితర రక్త పరీక్షలను ఉచితంగా చేసేలా ఎస్పీ సంకల్పించి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది శారీరకంగా, మానసికంగా ఎంత దృఢంగా ఉంటే అంత మంచి సేవలందించగలరని తెలిపారు. పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటే ఉల్లాసంగా విధులు నిర్వహిస్తారన్నారు. అదనపు ఎస్పీ హనుమంతుతో సహా పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఇద్దరు టీచర్లపై సస్పెన్షన్ ఎత్తివేత

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ జిల్లా పర్యటనలో గుర్తించిన లోపాలకు బాధ్యులుగా సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు టీచర్లు భాగ్యలక్ష్మి (అనంతపురం), జయమణి (పి.యాలేరు)లపై సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పందించిన విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, కల్పలతారెడ్డిలకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా సస్పెన్షన్ ఎత్తివేసిన ఇద్దరి టీచర్లపై చార్జెస్ ఫ్రేమ్ చేశామని విచారణ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యలు ఉంటాయని డీఈఓ పేర్కొన్నారు.

మహిళల ఫుట్‌బాల్ విజేత అనంతపురం



అనంతపురం జిల్లా జట్టుకు విన్నర్స్ ట్రోఫీ అందజేస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏఎన్‌యూ: రాష్ట్ర స్థాయి మహిళల ఫుట్‌బాల్ పోటీల విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లా జట్టుతో పాటు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాల జట్లకు బహుమతులు అందజేశారు.

లగేజీ.. నిఘా ఏదీ?

- ప్రైవేటు ట్రావెల్స్ నుంచి భారీగా అనధికారిక లగేజీ
- ప్యాసింజర్ల రవాణా వెనుక గోప్యంగా సరుకు రవాణా
- అందులో ఏ వస్తువులు వస్తున్నాయో తెలియని పరిస్థితి
- జీఎస్టీ లేకుండా వస్తుండటంతో ప్రభుత్వానికి భారీగా నష్టం
- పాత టికెట్లు క్యాన్సిల్ చేసి ఎక్కువ సొమ్ముకు అమ్ముకున్న ట్రావెల్స్ యాజమాన్యాలు



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి లగేజీ దింపుతున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో వస్తున్న లగేజీలో ఏముంది? ఇక్కడి నుంచి ఏం తీసుకెళుతున్నారు? వెళ్తున్న వస్తువులకు జీఎస్టీ బిల్లులున్నాయా? దీన్ని ఎవరైనా అధికార వర్గాలు చెక్ చేస్తున్నాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒక చిన్న ఐషర్ వాహనం లోడుతో వెళ్తుంటేనే సవాలక్ష తనిఖీలు చేసే అధికారులు.. ప్రైవేటు ట్రావెల్స్‌లో వచ్చే సరుకును ఎందుకు చెక్ చేయడం లేదు.. ప్యాసింజర్ల వాహనాల ముసుగులో జరుగుతున్న గూడ్స్ రవాణాపై ఎందుకు దృష్టి సారించడం లేదన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

ఆ సరుకుపై నియంత్రణ లేదు

అనంతపురం నుంచి వివిధ ప్రాంతాలకు రోజూ 30కి పైగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు వెళుతున్నాయి. అంతే స్థాయిలో రోజూ అనంతపురానికి వస్తున్నాయి. ఉదయం 5 గంటలకే అనంతపురం చేరుకునే ఈ వాహనాల నుంచి రకరకాల లగేజీ బస్తాల కొద్దీ దించుకుంటారు. ఈ లగేజీలో ఏముందో ఎవరికీ తెలియదు. హైదరాబాద్ నుంచి ఎలక్ట్రిక్, స్టీల్, ప్లంబింగ్‌తో పాటు రకరకాల వస్తువులు జీఎస్టీ లేకుండా వస్తున్నట్టు తెలిసింది. అంతేకాదు ఇక్కడినుంచి వెళ్లే వాహనాల్లో ధర్మవరం నుంచి రోజూ వందల కొద్దీ ఖరీదైన పట్టు చీరలు చెన్నై, విజయవాడ వెళ్తున్నట్టు సమాచారం. ధర్మవరం నుంచి వెళ్లే ఈ చీరలకు ఎలాంటి జీఎస్టీ ఉండదు. ఇవే కాదు జిల్లా నుంచి రకరకాల వస్తువులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో వెళుతున్నా అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. అసలు ఆ లగేజీలో ఏముందో కూడా చెక్ చేయడం లేదు. కమలానగర్‌లో ఎక్కువగా జీరో బిజినెస్ జరుగుతోంది. దీనిపై పట్టించుకునే నాథుడే లేరు. బస్సుల్లో వస్తున్న లగేజీ ఎక్కువగా కమలానగర్‌కే వస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

ట్రావెల్స్ యాజమాన్యం తీరు దారుణం

ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రయాణికుల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నాయి. ఇటీవలే దసరా పండుగ సందర్భంగా ఓ ట్రావెల్స్ యాజమాన్యం వ్యవహరించిన తీరు ఇందుకు అద్దం పడుతోంది. పండుగకు ఊళ్లకు వెళ్లేందుకు ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్నారు. కాగా పండుగ ముందురోజు ట్రావెల్స్ యాజమాన్యం బస్సు చెడిపోయిందని అందరికీ డబ్బు వెనక్కు ఇచ్చింది. కానీ ఎక్కువ డబ్బులు ఇచ్చిన వారిని ఎక్కించుకుని అదే బస్సును హైదరాబాద్‌కు నడిపారు. వారం రోజుల ముందే బుక్ చేసుకున్న ప్రయాణికులు అష్టకష్టాలు పడి గమ్యస్థానం చేరుకోవాల్సి వచ్చింది. మరికొద్ది రోజుల్లో దీపావళి పండుగ వస్తోంది. ఆ సమయంలోనూ ఇలాగే వ్యవహరించే అవకాశం ఉందని కొంతమంది ప్రయాణికులు వాపోతున్నారు.

ఆదేశాలుంటేనే తనిఖీలు

మాకు కమిషనరేట్ నుంచి స్పష్టమైన ఆదేశాలుంటేనే తనిఖీలు చేయగలం. లేదా ఇక్కడ ఏదైనా కచ్చితమైన ఫిర్యాదు ఆధారంగా అయినా తనిఖీ చేస్తాం. అంతేగానీ నేరుగా ప్రైవేటు ట్రావెల్స్ లగేజీలపై తనిఖీలు చేసి, జరిమానాలు వేసే అధికారం లేదు.

– శేషాద్రి, జాయింట్ కమిషనర్, జీఎస్టీ

ఓవర్ లోడ్ లేకుండా చూడటం వరకే..

బస్సుపైన ఎలాంటి లగేజీ తేవడానికి వీల్లేదు. ఓవర్ లోడ్ లేకుండా చూడడం కూడా మా బాధ్యతే. అంతేగానీ లగేజీలో ఏముంది.. వాటికి జీఎస్టీ ఉందా లేదా, వే బిల్లులు ఉన్నాయా లేవా అని చూడడం మా బాధ్యత కాదు.

–వీర్రాజు, ఉపరవాణా కమిషనర్, రవాణా శాఖ

'టౌన్ ప్లానింగ్'లో ఏసీబీ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

హిందూపురం: ప్రజల నుంచి భారీగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంపై దాడులు చేశారు. నేరుగా టౌన్ ప్లానింగ్ విభాగానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. అధికారుల పనితీరు గురించి విచారణ చేపట్టారు. పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ సీఐ మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ... అవినీతి నిరోధానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 14400 నంబర్‌కు టౌన్ ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని, అలాగే మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ప్రస్తుతానికి భవన నిర్మాణాల అనుమతులకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్నామన్నారు. కొన్ని భవన నిర్మాణాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. అధికారులు అవినీతికి పాల్పడినట్లు తేలితే కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా చేస్తామన్నారు. దాడుల సమయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులు, సిబ్బంది రూ.46 వేలు నగదు సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణ సమయంలో రూ.వెయ్యి కంటే ఎక్కువ మొత్తం ఉంచుకోరాదని, ఆ నగదు వివరాలు కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు వివరాలు నమోదు లేకపోవడంతో వాటిని నాన్ అకౌంట్‌గా పరిగణించి సీజ్ చేశామన్నారు. మరో రెండు రోజుల పాటు విచారణ కొనసాగుతుందని, ఆ తర్వాత చర్యలు ఉంటాయన్నారు.

అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు

గుంతకల్లు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ గౌతమి అర్జీదారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మండల, డివిజన్, జిల్లా స్థాయిలోనూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 31 మండలాల్లోనూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఇంటినుంచే 1902 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి వారి సమస్యను చెబితే నేరుగా సీఎంఓ ఆఫీస్ ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు 105 అర్జీలను అందజేశారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి

వజ్రకరూరు: నాణ్యమైన విద్యనందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. శుక్రవారం వజ్రకరూరులోని కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (రాష్ట్ర విద్యా సామర్థ్య పరీక్ష)ను కలెక్టర్ పరిశీలించారు. మూడు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్ష గురించి ఆరా తీశారు. కొన్ని తరగతి గదుల్లో విద్యార్థులు నేలపై కూర్చోవడాన్ని చూసి.. వెంటనే బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు వండిన ఆహార పదార్థాలను పరిశీలించి.. మెనూ పాటించాలని స్పష్టం చేశారు. ఆర్‌ఓ ప్లాంట్‌కు త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా చూడాలని హెచ్‌ఎం స్వర్ణలత కోరగా.. కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ వివరాలు ఆరాతీసి, నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, తహసీల్దార్ అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' సొమ్ము విడుదల చేసేందుకు ఈ నెల 7న సీఎం జగన్ పుట్టపర్తికి విచ్చేస్తున్నారని, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం వారు ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, పుట్టపర్తి, మడకశిర, కదిరి, రాప్తాడు ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి కలెక్టరేట్‌లోని 'స్పందన' సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. సీఎం పర్యటనకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్షించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే పుట్టపర్తి విమానాశ్రయం సమీపంలోని వై జంక్షన్ వద్ద ఉన్న గ్రౌండును పరిశీలించారు. అక్కడి నుండి వాహన పార్కింగ్‌కు అనుకూలంగా ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండును, సత్యసాయి విమానాశ్రయాన్ని పరిశీలించారు. తలశిల రఘురాం, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు మాట్లాడుతూ ఈ నెల 7న ఉదయం 9.30 గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి బహిరంగ సభకు చేరుకొని రైతులనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. రాష్ట్రంలోని రైతులకు ఇక్కడి నుండే వైఎస్సార్ రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తారన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు.



సీఎం బహిరంగ సభ జరిగే మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎంపీ మాధవ్ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు

కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో పోలీసు అధికారుతో సమావేశమై ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ సీఎం సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. భద్రతా ఏర్పాట్లు ఎలాంటి లోపం రాకుండా సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు.

ఒక్క క్షణం ఆలోచించండి

- కలవరం రేపుతున్న ఆత్మహత్యలు
- జిల్లాలో 10 నెలల్లో 449 మంది ఆత్మహత్య
- దుష్ప్రభావం చూపుతున్న సామాజిక మాధ్యమాలు
- యుక్తవయసులోనే వ్యసనాలతో బలవన్మరణాల వైపు..



సాక్షి ప్రతినిధి, అనంతపురం:

- శెట్టూరు మండలం కైరేవు గ్రామానికి చెందిన అభిషేక్ (21) డిగ్రీ చదివాడు. ఉద్యోగం చేయాల్సిన వయసులో ముఖంపై మచ్చలున్నాయని, క్రీములు వాడినా తగ్గడం లేదని ఈ నెల ఒకటో తేదీన ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం ఉప్పరహట్టి గ్రామానికి చెందిన సతీష్ (16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ముగ్గురు అమ్మాయిల తర్వాత పుట్టిన కొడుకంటే తల్లికి చాలా ఇష్టం. కళాశాలకు సక్రమంగా వెళ్లాలని మందలించినందుకు మనస్తాపం చెందిన సతీష్ నవంబర్ ఒకటో తేదీన బలవన్మరణానికి పాల్పడ్డాడు.

జిల్లాలో ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. క్షణికావేశం నిండు నూరేళ్ల జీవితాన్ని చిదిమేస్తోంది. కుటుంబానికి పెద్దదిక్కుగా నిలబడి ముందుకు నడిపించాల్సిన యువకులు చిన్న చిన్న కారణాలకు మనస్తాపం చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న తీరు ఆయా కుటుంబాలను విషాదంలో ముంచెత్తుతున్నాయి. రోజూ ఏదో ఒక చోట ఆత్మహత్యల విషాద వార్త వినాల్సి వస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు 449 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో ఎక్కువగా యువతీ యువకులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పాతికేళ్ల పాఠాలు నేర్చుకుని ప్రపంచాన్ని తెలుసుకున్న వారే నిండుప్రాణాలను నిముషాల్లో తీసుకుంటున్న తీరు మానసిక వైద్యులను విస్మయపరుస్తోంది.

ప్రాణాలు తీస్తున్న క్షణికావేశం

ఇటీవల జరుగుతున్న ఆత్మహత్యల్లో 90 శాతం కేసులు క్షణికావేశంలో నిర్ణయం తీసుకున్నవేనని పోలీసుల పరిశీలనలో వెల్లడైంది. తండ్రి తిట్టాడనో, ప్రియురాలు వద్దన్నదనో, మార్కులు తక్కువగా వచ్చాయనో ఇలాంటి చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకోవడం విస్మయపరుస్తున్నాయి.

ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు

- ఇతరులను పోల్చుకుని.. తమకు లేవని డీలా పడిపోవడం.
- సామాజిక మాధ్యమాల్లో కొత్త పోకడలకు అలవాటు పడడం.
- బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా ఆర్థికంగా చితికిపోవడం.
- కుటుంబాల్లో, భార్యా భర్తల మధ్య గొడవలతో విసిగిపోవడం.
- గంజాయి, మద్యం వ్యసనాలకు బానిస కావడం.
- తల్లిదండ్రులు గారాబంగా పెంచడం వల్ల ఎమోషన్ పొటెన్షియాలిటీ లేక క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకోవడం.

జిల్లాలో ఈ ఏడాది జనవరి 1నుంచి అక్టోబర్ 31 వరకు ఆత్మహత్యల వివరాలు

ఉరివేసుకున్న వారు

వయసు	పురుషులు	మహిళలు
14-18 ఏళ్లు	7	10
18-30 ఏళ్లు	65	60
30-45 ఏళ్లు	73	21
45-60 ఏళ్లు	37	6
60 ఏళ్ల పైన	9	3

విషం తీసుకున్నవారు..

14-18 ఏళ్లు	2	4
18-30 ఏళ్లు	20	13
30-45 ఏళ్లు	48	13
45-60 ఏళ్లు	37	6
60 ఏళ్ల పైన	27	10

(వీళ్లు కాకుండా ఒంటిపై నిప్పు పెట్టుకుని పురుషులు ఇద్దరు, మహిళలు ఒకరు, నీళ్లలో దూకి పురుషులు ఆరుగురు, మహిళలు నలుగురు ప్రాణాలు తీసుకున్నారు. వివిధ పద్ధతుల్లో మరో ముగ్గురు పురుషులు, ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్నారు.)

నైతిక విలువలు నేర్పాలి



శరీరానికి వ్యాధినిరోధక టీకాలు ఇస్తున్నాం. మనసు బాధపడితే టీకాలు ఎక్కడున్నాయి? తల్లిదండ్రులు అత్యంత గారబంగా పెంచుతున్నారు. నైతిక విలువలు, బంధాలు వంటివి నేర్పడం లేదు. సమాజం గురించి చెప్పకపోవడం వల్ల వాళ్లు ఇలా అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. ముందుగా తల్లిదండ్రుల్లో మార్పు వచ్చి పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి.

–డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు

కెరీర్ లక్ష్యంగా ముందుకు సాగాలి



తల్లిదండ్రులకు, సమాజానికి అండగా ఉండాల్సిన వయసులో ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరం. యువతీ యువకులు కెరీర్ లక్ష్యంగా ముందుకు సాగాలి కానీ, చిన్నచిన్న కారణాలతో తనువు చాలించడం సరికాదు. ఇలాంటి యువతీ యువకుల్లో ఏదైనా తేడా ఉన్నప్పుడు తల్లిదండ్రులు వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేదా పోలీసుల వద్దకు తీసుకొచ్చినా కౌన్సెలింగ్ ఇస్తాం. యువతీ యువకులు తమమీద ఆధారపడి ఉన్న కుటుంబం గురించి కూడా లోచించాలి.

– కేకేఎన్ అన్బురాజన్, ఎస్పీ

సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: యూపీఎస్సీ ద్వారా నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆర్థికంగా అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి సూచించారు. సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలు ఉండాలన్నారు.

టెన్నికాయిట్ జట్ల ఎంపిక



టెన్నికాయిట్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొనే టెన్నికాయిట్ అండర్–14 , అండర్–17 బాల, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియను శుక్రవారం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా కార్యదర్శి బి.సుగుణమ్మ తెలిపారు. ఎంపిక పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నాగచరిత, కృష్ణవేణి, సుప్రియ, దివ్య, దిలక్షిత, బాలాజీ, వేము చరణ్, గణేష్, యశ్వంత్, గురుస్వామి, అనుష్క, జ్యోతిక, స్పందన, పూజ, వర్ష, రాంచరణ్, లతీఫ్, మోహన్ రాజ్, చిన్ని కృష్ణ, మహిధర్ ఎంపికయ్యారు.

6, 7 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక

అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొనే అండర్ –14, అండర్ – 17 బాల, బాలికల జట్ల ఎంపికను ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా కార్యదర్శి సుగుణమ్మ తెలిపారు. అండర్ –14 బాల, బాలికల జట్లకు ఆరో తేదీన, అండర్ –17 బాల, బాలికల జట్లకు ఏడో తేదీన ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.





అనుమానం పెనుభూతమై..

- కట్టుకున్న భార్యను రోకలితో మోది చంపిన భర్త



హతురాలు నారాయణమ్మ

అనంతపురం క్రైం: అనుమానం పెనుభూతం కావడంతో కట్టుకున్న భార్యను రోకలితో మోది చంపేశాడు ఓ భర్త. పట్టణంలోని రుద్రంపేటలో ఈ దారుణం చోటు చేసుకుంది. నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాలమేరకు... రుద్రంపేట చాకలివీధిలో నివాసం ఉంటున్న నాగరాజు, నారాయణమ్మ (38) దంపతులు. వీరికి 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేరు. నారాయణమ్మ తన చెల్లి కుమారుడిని దత్తతకు తీసుకుని పెంచుతోంది. సాఫీగా సాగిపోతున్న కాపురంలో భర్త నాగరాజుకు అనుమానమనే భూతం పట్టుకుంది. ఈ క్రమంలో ఇరువురి మధ్య తరచూ గొడవలు జరిగేవి. పెద్దలు సర్దిచెప్పడం కొద్ది రోజులు నాగరాజు మామూలుగా ఉన్నట్లు నటించడం తిరిగి వేధించడం పరిపాటిగా మారిపోయింది. భార్య ఎవరితో మాట్లాడినా తిట్టడం, కొట్టడం చేసేవాడు. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి కూడా దంపతుల మధ్య గొడవ జరిగింది. తెల్లవారు జామున నిద్రలో ఉన్న నారాయణమ్మను భర్త నాగరాజు రోకలితో తలపై మోది చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో పక్కింటి వారు నారాయణమ్మను పలకరించేందుకు వెళ్లి చూడగా ఆమె గదిలో కనిపించ లేదు. పిలిచినా పలకకపోవడంతో అనుమానం వచ్చి లోపలకు వెళ్లి చూడగా రక్తపు మడుగులో విగత జీవిగా పడివుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నారాయణమ్మ చనిపోయినట్లు గుర్తించారు. నిందితుడు నాగరాజును పోలీసులు శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతోనే హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు.



ఎంఎల్‌ఎస్ పాయింట్లపై దృష్టి



బాధ్యతలు స్వీకరిస్తున్న రవీంద్ర

అనంతపురం అర్బన్: పౌర సరఫరాల సంస్థ పరిధిలోని ఎంఎల్‌ఎస్ (మండల లెవల్ స్టాక్) పాయింట్లు, డీలర్లకు బియ్యం, సరుకులు రవాణా (స్టేజ్-2)పై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆ సంస్థ నూతన జిల్లా మేనేజర్ (డీఎం) జె.రవీంద్ర స్పష్టం చేశారు. సంస్థ కార్యకలాపాలకు సంబంధించి ఏస్థాయిలోనూ అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గుంతకల్లు ఆర్‌డీఓగా ఉన్న ఆయనను ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థ డీఎంగా నియమించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయన డీఎంగా బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను వందశాతం అమలు చేస్తామన్నారు. బియ్యం, సరుకులకు సంబంధించి స్టేజ్-2 రవాణా పకడ్బందీగా జరిగేలా చూస్తామన్నారు.



వివాహేతర సంబంధం వల్లే వాచ్‌మెన్ హత్య

ఉరవకొండ: కూడేరు మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఓ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న రామచంద్రాపురం బంగినారాయణ(65) దారుణ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉరవకొండ రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప, ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, కూడేరు ఎస్‌ఐ సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని శ్రీవిద్యా ఇన్‌ఫ్రా ప్రాజెక్టు వెంచర్‌లో రామచంద్రాపురం గ్రామానికి చెందిన బంగినారాయణ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన తలారి హనుమంతు భార్యతో గత కొంత కాలంగా నారాయణ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న హనుమంతు అతనిపై కక్ష పెంచుకున్నాడు. స్నేహితుడు రామలింగ సహాయంతో ఈనెల 1న రాత్రి శ్రీవిద్యా వెంచర్‌లో మంచంపై నిద్రిస్తున్న నారాయణ తలపై కర్రలతో కొట్టి చంపి అక్కడి నుంచి ఇద్దరూ పరారయ్యారు. ఇద్దరు ముద్దాయిలను కూడేరు మండలం అరవకూరు బస్టాప్ వద్ద శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



అమ్మాయి విషయంలో గొడవ

- కుటుంబంపై హత్యాయత్నం

తాడిపత్రి: అమ్మాయి విషయంలో గొడవ.. ఓ కుటుంబంపై హత్యాయత్నానికి దారి తీసింది. అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు... గన్నెవారిపల్లి కాలనీకి చెందిన మహేశ్వరరెడ్డి సోదరి తాడిపత్రి పట్టణానికి చెందిన యువకుడిని ప్రేమించింది. ప్రేయసితో కలిసి గోబీ తినాలని భావించిన యువకుడు గురువారం రాత్రి తన స్నేహితుడు, గన్నెవారిపల్లి కాలనీకే చెందిన సాయికుమార్‌ను పురమాయించాడు. స్నేహితుడి కోసం సాయి కుమార్ ఆమెను బైక్‌పై ఎక్కించుకుని పట్టణంలోకి బయల్దేరాడు. అదే సమయంలో మహేశ్వరరెడ్డి కంటపడ్డారు. అంతే అతడు మరో బైక్‌పై వారిని వెంబడించాడు. గమనించిన సాయి కుమార్ వెంటనే అమ్మాయిని కిందికి దింపేసి తాను వేగంగా వెళ్లిపోయాడు. పట్టణంలోని యల్లనూరు రోడ్డులోకి వెళ్లగానే మహేశ్వర్‌రెడ్డి మరో ముగ్గురితో కలిసి రాడ్లతో సాయికుమార్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఇంటికి వచ్చిన సాయికుమార్‌ను చూసి కుటుంబ సభ్యులు విషయం కనుక్కొన్నారు. ఒక్కడిని చేసి ఇలా చావబాదుతారా అంటూ బాధితుడి కుటుంబ సభ్యులు మహేశ్వర్‌రెడ్డి ఇంటికెళ్లి నిలదీశారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి పరస్పరం రాళ్లతో దాడి చేసుకున్నారు. మరింత కోపోద్రిక్తుడైన మహేశ్వరరెడ్డి తనవద్దనున్న పిడిబాకుతో సాయి కుమార్ సోదరుడైన రాజ్‌కుమార్‌కు ఛాతీ, వీపు, డొక్కల్లో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



క్లుప్తంగా

సజావుగా ఎన్ఏఎస్ సర్వే పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు

ఆత్మకూరు: విద్యార్థులు ఎంత మేర చదివారు.. ఎంత వరకు మేథాశక్తి ఉందో తెలుసుకునేందుకు జాతీయ సాధన సర్వే పరీక్ష (నేషనల్ అచీవ్మెంట్ సర్వే పరీక్ష - ఎన్ఏఎస్) నిర్వహించినట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలో 20 పాఠశాలల్లో 3,6,9వ తరగతి విద్యార్థులకు ఎన్ఎస్ఏ పరీక్ష నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పరీక్షలను ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు పరిశీలించారు.

గురుమూర్తికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న గురుమూర్తి గుప్త

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ప్రఖ్యాత జ్యోతిష్య పండితుడు చిత్రాల గురుమూర్తి గుప్తను మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు (ఆర్ట్ యూనివర్సిటీ) గౌరవ డాక్టరేట్తో సత్కరించింది. శుక్రవారం ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. మూడు దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించినందుకు గాను తనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

లోకేశ్వర రెడ్డికి డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్ విభాగంలో పరిశోధన చేసిన తొట్లి లోకేశ్వర రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఫిజిక్స్ ప్రొఫెసర్/ సీడీసీ డీన్ డాక్టర్ కే రాంగోపాల్ పర్యవేక్షణలో ' దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోని సెమీ-ఎరిడ్ స్టేషన్స్పై కరువులు- వాతావరణ శాస్త్ర స్థితిగతులపై అధ్యయనాలు ' అనే అంశంపై పరిశోధన చేశారు. దక్షిణ భారతదేశంలో వరుసగా ఐదేళ్లు అత్యధిక వర్షపాతం, ఐదేళ్లు కరువు తరచుగా ఏర్పడుతున్నాయని తన పరిశోధనల్లో గుర్తించారు. భవిష్యత్లో ఉండబోవు వాతావరణ పరిస్థితులపైనా తన పరిశోధనల ద్వారా తెలియజేశారు. ఈ అంశంపై 10 అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా లోకేశ్వర రెడ్డిని తోటి పరిశోధన విద్యార్థులు, ప్రొఫెసర్లు అభినందించారు.

రేపు నారీ శక్తి సమ్మేళనం



మాట్లాడుతున్న నారీ శక్తి సమ్మేళన సమితి అధ్యక్షురాలు ఉజ్వల

అనంతపురం టవర్క్లాక్: మహిళల్లో చైతన్యం కలిగించేందుకు ఈనెల 5న నిర్వహించనున్న నారీ శక్తి సమ్మేళనం జయప్రదం చేయాలని నారీ శక్తి సమ్మేళన సమితి అధ్యక్షురాలు ఉజ్వల కోరారు. శుక్రవారం స్థానిక గీతా మందిరంలో నారీ శక్తి సమ్మేళన సమితి సమావేశం నిర్వహించారు. ఉజ్వల మాట్లాడుతూ ఈనెల 5న జీఎం గార్డెన్ ఫంక్షన్ హాల్లో నారీ శక్తి సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఉషశ్రీ చరణ్, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్పర్సన్ గిరిజమ్మ హాజరవుతారన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన అంజినమ్మ అనే మహిళ ఉరి వేసుకుని శుక్రవారం ఆత్మ హత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రాప్తాడుకు చెందిన అంజినమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించగా, అప్పటికే ఆమె మృతి చెందింది. ఆమె భర్త కూడా కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నా రు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

రాప్తాడు: మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రాప్తాడు పోలీస్స్టేషన్ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, చోరీలు, రికవరీలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి ఉంచాలని, అలాగే రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పోలీస్స్టేషన్లకు వివిధ కేసులపై వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల సంతృప్తి



ఉప్పరపల్లిలో సీసీరోడ్లు, డ్రైనేజీల శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి

రాప్తాడురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో ఉదయం, కందుకూరు పంచాయతీ కృష్ణంరెడ్డిపల్లిలో సాయంత్రం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. నూతన రైతు భరోసా కేంద్రం, అంగన్వాడీ కేంద్ర భవనాలను ప్రారంభించారు. ఉప్పరపల్లిలో రూ. 39 లక్షల నిధులతో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. 32 లక్షలతో పైపులైను పనులను ప్రారంభించారు. 75 లక్షల నిధులతో జల జీవన్ మిషన్ స్కీం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే పరిశీలించారు.

ప్రతి కుటుంబానికీ పథకాల లబ్ధి..

ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నన్ని రోజులూ అన్ని వర్గాలను వంచించారని విమర్శించారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందిందన్నారు. ఒక్కో కుటుంబం గరిష్టంగా రూ. 4 లక్షలకు పైగా లబ్ధి పొందిందన్నారు. ఉప్పరపల్లి గ్రామంలో 250 మందికి ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. జగనన్నకాలనీలో 2 వేల ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఏ ప్రభుత్వంలోనూ చేయని విధంగా రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికే మళ్లీ తమ మద్దతు ఇస్తామని ప్రజలు చెప్తున్నారన్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. వచ్చే ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలో మళ్లీ మంచి మెజార్టీతో గెలవబోతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 151 కంటే మెరుగైన సంఖ్యలో సీట్లు గెలుస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఉప్పరపల్లి, కందుకూరు సర్పంచ్లు సావిత్రి శ్రీనివాసులు, ప్రశాంత్కుమార్, మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాగే రేవతిపెద్దప్ప, శారదాకొండారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పెరవలి జయచంద్రారెడ్డి, నాయకులు పాళ్యం శివయ్య, చిరంజీవి, మాజీ సర్పంచ్ రవిశేఖర్రెడ్డి, ఉపసర్పంచ్ బండి భాస్కర్, రమాదేవి, నల్లపరెడ్డి, ఆనందప్ప, అంజి, వెంకటేశులు, బాలు, శీన పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్, ఆడిటర్స్ కాలనీ, పంచాయతీ రాజ్కాలనీ, ఇందిరమ్మ కాలనీలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ సి.మునివేలు తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వైద్య సేవలు మరింత చేరువ



జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని అశోక్నగర్లోని సరస్వతి విద్యామందిర్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఒక కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలందించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల్లో 64 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు ఇస్సాక్, కమల్భూషణ్, అనిల్కుమార్ రెడ్డి, నాయులు జావెద్, తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోండి

- జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వ



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వ

అనంతపురం సిటీ: హెచ్చెల్సీ మెయిన్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ)లోనూ నీటి నిల్వలు లేవని, వీటి పరిధిలోని వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేసిన పంటలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు అనంతపురం జిల్లా ఇన్చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో వారిద్దరూ శుక్రవారం కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి అదనపు కోటా నీటి విడుదలకు ఒప్పించాలన్నారు. ఈ అంశంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సానుకూలంగా స్పందించారని బోయ గిరిజమ్మ తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు హర్షణీయం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీకి కేబినెట్ ఆమోదం తెలపడంపై ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో హర్షంవ్యక్తం చేశారు. ప్రతి జర్నలిస్టుకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి మాట ఇస్తే అమలు చేస్తారన్నారు. ఎన్నికల హామీ నిలబెట్టుకుని జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వడం ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే అనంత కృతజ్ఞతలు తెలిపారు.

కాలువ పనులు పూర్తి చేయించాలి



కమిషనర్కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్సీపీ లీగల్సెల్ నేత బీ నారాయణరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రాంనగర్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేసి, రోడ్డు వేయించాలని వైఎస్సార్సీపీ లీగల్సెల్ నేత బీ నారాయణ రెడ్డి కమిషనర్ కే భాగ్యలక్ష్మిని కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్కు ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ కాలువ ఏర్పాటుకు మట్టి పనులు చేపట్టి, కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ఎత్తుపల్లాలు ఉండడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారిందన్నారు. న్యాయవాదులు సుబ్బన్న, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి పుస్తకాలతో ఉత్తమ వ్యక్తిత్వం



మాట్లాడుతున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం: మంచి పుస్తకాలు చదివే ఆసక్తి ఉన్నట్లయితే ఉత్తమ వ్యక్తిత్వం అలవడుతుందని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ ఎల్ఎం ఉమ, కార్యదర్శి రమ అధ్యక్షతన గ్రంథ పాలకుల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.2,45,333 విలువజేసే రీడర్స్ ఆన్ డిమాండ్ పుస్తకాలు వివిధ గ్రంథాలయాలకు అందజేసే కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ పరీక్షల్లో విజేతగా నిలవాలంటే గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ఉప గ్రంథాలయ అధికారి వి. సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి 'అమ్మ' చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

శింగనమల: మండల కేంద్రానికి చెందిన బేల్దారి వీరన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, తల్లి ఉన్నారు. కుటుంబ యజమాని మరణంతో అతని కుటుంబం వీధిన పడింది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శింగనమలకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వీరికి రూ.40 వేలు ఆర్థిక సాయం, కుటుంబ జీవనోపాధికోసం కుట్టు మిషన్, నిత్యావసర సరుకులు, బియ్యం, దుస్తులు అందించారు. పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా వారికి సహకారం అందిస్తామని అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి భరోసా కల్పించారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

అనంతపురం కల్చరల్: నగరంలో హౌసింగ్ బోర్డులో భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 7: 30 గంటల నుంచి వైద్య శిబిరం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

లాభాపేక్ష లేకుండా ధర్మప్రచారం చేయాలి

- బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు



బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుతో జేఎన్టీయూ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: ఎలాంటి లాభాపేక్ష లేకుండా ధర్మ ప్రచారానికి పాటుపడాలని బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల అనుబంధంతోనే అభ్యున్నతి అన్నారు. జేఎన్టీయూ అనంతపురంలో శనివారం, ఆదివారం ' మాతృ చతుష్టయం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 'ధర్మ వర్దని' అనే ట్రస్టు తరపున వేలాది మంది విద్యార్థులకు, ప్రజలకు సనాతన ధర్మంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. లోకమాత, భూమాత, గోమాత, కన్నతల్లి గొప్పదనం వివరించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తొలి రోజు రెండు అంశాలు, రెండో రోజు రెండు అంశాలపై ప్రవచనం ఇస్తామన్నారు. మానవీయ విలువలు, ఆధ్యాత్మిక భావనలు బలపడి సమాజంలో విలువలు నింపుటకు మరింత దోహదపడేందుకు ధర్మవర్ధని అనే ట్రస్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. రెండో రోజు కొందరు విద్యార్థులు తమ మాతృమూర్తులకు పూజ చేసే ' మాతృపూజ' అరుదైన ప్రత్యేక అంశం ఉంటుందన్నారు. డాక్టర్ చాగంటి కోటేశ్వరరావును జేఎన్టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు

ఆత్మకూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ సుబ్బర హేమలత అన్నారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చాంబర్లో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ పూజారి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పథకాలను ప్రతి ఇంటికీ తెలియజేసే బాధ్యత మన అందరిదీ అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఇంకా అర్హులై ఉండి, పథకాలు అందకుంటే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి ఆత్మకూరు మండలానికి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్కుమార్ నాయక్, సర్పంచ్లు లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేసు, ఎర్రిస్వామి, నరసింహ, చిత్రా ఓబులేష్, తిరుపాలమ్మ, రేణుకమ్మ, ఉజ్జినప్ప, ఆరోగ్యంరెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మి, లక్ష్మీదేవి, ఓబులేష్, కోఆప్షన్ మెంబర్ మన్సూర్వలి, వైఎస్సార్సీపీ నాయకులు కృష్ణానాయక్, వన్నూరప్ప, నరసింహ, రవి, వెంకటేష్, ఎర్రిస్వామిపాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఆత్మకూరు: అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ రఘునాథ్ మండలంలోని అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బర హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వారం రోజుల క్రితం వడ్డుపల్లిలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కొందరు అధికారులు కార్యక్రమానికి రాకపోవడంతో అధికారుల నుంచి సరైన సమాధానం, సమాచారం లేక ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి కూడా అధికారులు గైర్హాజరుకావడంతో కలెక్టర్ మండిపడ్డారని తెలిపారు. అనంతరం పలు శాఖల ప్రగతిని అధికారులు చదివి వినిపించారు. జగనన్న ఇంటి నిర్మాణాల్లో భాగంగా మండల వ్యాప్తంగా 2,464 ఇళ్లు మంజూరయ్యాయని, 646 పూర్తి దశలో ఉన్నాయన్నారు. మిగిలిన వారు కూడా డిసెంబర్లోపు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ అనీల్ తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఏపీఎం మధన్ మోహన్, డాక్టర్ దయాకర్, సర్పంచ్లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతరు

- నేటికీ విధుల్లో చేరని అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది

రాప్తాడురూరల్: కొత్తగా ఏర్పడిన అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన సజావుగా సాగేలా సిబ్బందిని నియమిస్తూ కలెక్టర్ గౌతమి గత నెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నా నేటికీ చాలామంది చేరలేదు. కొందరు ఉన్నతాధికారుల వద్ద పైరవీలు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇద్దరు తహసీల్దార్లతో పాటు ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లు, ఇద్దరు ఆర్ఐలు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను కేటాయించారు. అర్బన్ తహసీల్దార్ బాలకిషన్, రూరల్ తహసీల్దార్ విజయలక్ష్మి విధుల్లో చేరారు. అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఎం.శ్రీనివాసులును అనంతపురం రూరల్ మండల డిప్యూటీ తహసీల్దార్గా నియమించారు. ఈయన పాత సీటులోనే కూర్చుంటున్నారు తప్ప బదిలీ సీటుకు వెళ్లలేదు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్గా పని చేస్తున్న దేవన్రాజును కలెక్టరేట్లోని ల్యాండ్స్ విభాగానికి బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న పి.మారుతీ ప్రసాద్రెడ్డిని అనంతపురం అర్బన్ డిప్యూటీ తహసీల్దార్గా నియమించారు. ఇద్దరూ ఎవరి సీటులో వారే కొనసాగుతున్నారు తప్ప రిలీవ్ కాలేదు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఈడీటీ పి.శ్రీరాములు, రూరల్ మండల రీసర్వే డీటీ దివాకర్రెడ్డి, అర్బన్ కార్యాలయ ఆర్ఐ సందీప్కృష్ణ, బాధ్యతలు తీసుకున్నారు. అర్బన్ మండల సీనియర్ అసిస్టెంట్గా పి.విజయభాస్కర్ రెడ్డి, రూరల్ మండల సీనియర్ అసిస్టెంట్గా బి.ఈశ్వర్రెడ్డి బాధ్యతలు తీసుకున్నా.. వీరిలో విజయభాస్కర్రెడ్డికి ఇప్పటిదాకా సీటు కూడా లేదు. చార్జ్ ఇవ్వలేదు. రూరల్ మండల ఆర్ఐ పి.ప్రశాంత్బాబు, రూరల్ మండల కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.వరప్రసన్నకుమార్, అర్బన్ మండల కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎస్.మహబూబ్బాషా నేటికీ విధుల్లో చేరలేదు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ రెండు కార్యాలయాలు ఒకేచోట ఉండడంతో అర్బన్ కార్యాలయంలోకి వెళ్తే రూరల్ కార్యాలయానికి, రూరల్ కార్యాలయంలోకి వెళ్తే అర్బన్ కార్యాలయంలోకి వెళ్లమని చెబుతున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్వాడీ ఆయా చేతివాటం

అనంతపురం సెంట్రల్: చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆలనాపాలన చూసుకోవాల్సిన ఓ అంగన్వాడీ హెల్పర్.. అత్యాసకు పోయి బంగారు ఉంగరం అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు..నగరంలో జీసస్నగర్లోని ఓ అంగన్వాడీ కేంద్రంలో పని చేస్తున్న హెల్పర్.. అదే కాలనీలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల రెండేళ్ల చిన్నారి ఆలనాపాలన చూసుకునేందుకు నెలకు రూ. 2 వేలు జీతానికి ఒప్పందం కుదుర్చుకుంది. రోజూ లాగా రెండు రోజుల క్రితం పాపను ఆయాకు అప్పజెప్పి సదరు తల్లిదండ్రులు విధులకు వెళ్లిపోయారు. సాయంత్రం రాగానే పాప వేలికి ఉన్న బంగారు ఉంగరం కనిపించకపోవడంతో ఆయాను ప్రశ్నించారు. అందుకు ఆమె తన కేమీతెలీదన్నట్లు చెప్పింది. బాధిత తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఆయాను విచారించగా, అసలు విషయం వెలుగులోకొచ్చింది. ప్రస్తుతం ఈ అంశం ఐసీడీఎస్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఘటనలో సీడీపీఓ లలితమ్మ మాట్లాడుతూ ఘటన జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

డిసెంబర్ 23న భగవద్గీత కంఠస్థ పోటీలు

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తాధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత కంఠస్థ పోటీలు డిసెంబర్ 23న ఉంటాయని టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో రామచంద్రనగర్లోని టీటీడీ కల్యాణ మండపంలో, సత్యసాయి జిల్లా కదిరిలో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 94923 25020లో సంప్రదించాలని కోరారు.

మస్టర్ సర్కిళ్ల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ మస్టర్ సర్కిళ్లను అదనపు కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వేకువజామున ఆయన పలు సర్కిళ్లలో కార్మికుల హాజరుపట్టికను పరిశీలించారు. కొందరు గైర్హాజరవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని వివిధ డివిజన్లలో చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలని సంబంధిత అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు.

సామూహిక వ్రతాలు

అనంతపురం కల్చరల్: నగరంలో సాయిట్రస్టు విజయ్కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్యదేవుడి సామూహిక వ్రతాలు నిర్వహించారు. గురువారం 108 దంపతులకు షష్టిపూర్తి వేడుకలు నిర్వహించారు. మరుసటిరోజున వేదపండితులు శాస్త్రోక్తంగా వ్రతాలు చేయించారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తనిఖీ

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యులు, స్టాఫ్నర్సులు, నాన్ టీచింగ్ స్టాఫ్ సమయపాలన పాటించాలని సూచించారు. ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు తప్పకుండా విధులకు హాజరుకావాలన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

అనంతపురం: శివకోటి ఆలయంలో శనివారం నుంచి 12 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం గణపతి పూజ, గంగపూజ, గోపూజ, పుణ్యాహవాచనం , కళాకర్షణ పూర్వక చండీ కలశస్థాపన, దేవనాంది, ఈ నెల 5న చండీ, రుద్ర, దుర్గా జప పారాయణ యాగాలు, 6న శ్రీ మహా గణపతి యాగం, 10న ఉదక శాంతి, రుద్రక్రమార్చన, వేదస్వస్తి, మంగళనీరాజనం, 11న శిఖర కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ, 12న మహా పూర్ణాహుతి, ఋత్విక సత్కారం చేయనున్నారు.

పేదలకు న్యాయం చేయండి

అనంతపురం టవర్క్లాక్: గార్లదిన్నె మండలం కల్లూరులో గుడిసెలు తొలగించిన పేద ప్రజలకు న్యాయం చేయాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్క్లబ్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ అధ్యక్షత వహించారు. రాంభూపాల్ మాట్లాడుతూ కల్లూరులో బాధిత పేదలకు గుడిసెలు తొలగించిన స్థలంలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు సన్మానం

అనంతపురం కల్చరల్: నగరంలోని రెండో రోడ్డు బహావుద్దీన్ మసీదులో పవిత్ర ఖురాన్లోని అన్ని ఘట్టాలను పవిత్ర భావంతో చదివిన వయో వృద్ధులను శుక్రవారం సన్మానించారు. హాజీ షఫీ, జలీల్ సాహెబ్, ముస్తాఫా అలీఖాన్, మహబూబ్ బాషా ఖురాన్ పూర్తిగా చదివి యువతకు స్ఫూర్తిగా నిలిచారని మసీదు ముతవల్లీ ఫరీదుద్దీన్ తెలిపారు.



ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రొటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.



● తగినంత నిద్ర

నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● ఫ్లూ టీకాలు

ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● పరిశుభ్రతను పాటించడం

ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● తగినంత దూరం పాటించడం

తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను వల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1996)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్


'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు




సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు


హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పీ వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పీ వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పీ వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.